
సాక్షి సంగారెడ్డి

శనివారం, 16, డిసెంబర్, 2023




రుణపాశం.. విషాదం

ఆర్థిక ఇబ్బందులతో ఏఆర్ కానిస్టేబుల్ తన భార్య, పిల్లలను గన్‌తో కాల్చి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు 8లో ▸



కార్తీక సిరులు

కార్తీక మాసంలో నాచారం పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తడంతో ఆదాయం అధికంగా సమకూరింది. వివరాలు 8లో ▸



కబ్జా కోరల్లో..

అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములను కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేణుకా ఎల్లమ్మకు ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన చండీయాగంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, ఎంపీటీసీ ఇందిరాసతీశ్, సర్పంచ్ కొన్యాల వెంకటేశం, పూజారి రాజు, నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీకాంత్, ఇబ్రహీం, అజీజ్, అజ్జు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



పాఠశాల కరస్పాండెంట్‌తో విద్యార్థినిలు

నారాయణఖేడ్: పట్టణంలోని ఈ–తక్షిల పాఠశాల విద్యార్థినిలు గ్రీష్మ, సాయిప్రత్యూష అండర్– 14 విభాగంలో జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సీహెచ్ శరత్‌కుమార్ తెలిపారు. ఈ మధ్య జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచూపిన వీరు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఒడిసాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

ప్రగతిచక్రాల పురస్కారాలు



సన్మానం పొందినవారితో అధికారులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ప్రగతిచక్రాల పురస్కారాలు అందజేశారు. 25ఏళ్ల విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదం లేకుండా బస్సులు నడిపిన డ్రైవర్ సంగయ్యను డీఎం మల్లేశయ్య, ముఖ్య అతిథిగా హాజరైన ఖేడ్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విఠల్ సన్మానించారు. నవంబరులో ప్రతిభచూపిన కాంతయ్య, రాములుకు నగదు పురస్కారం అందజేశారు. పీఆర్వో పాండు, గ్యారేజి సూపర్‌వైజర్ ఉస్మాన్, కిషన్ ప్రసాద్, శివకుమార్, సంగొండ, ఆంజనేయులు, సుధాకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



మాట్లాడుతున్న అధికారి శైలజ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని తొగర్‌పల్లిలో శుక్రవారం పంచాయతీ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యావన శాఖ డివిజన్ అధికారి శైలజ మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు మొక్కలు, డ్రిప్‌లను రాయితీతో అందించనున్నట్లు తెలిపారు. ఒక్కో మొక్కకు రూ.20 చెల్లించాల్సి ఉంటుందని, డ్రిప్ ఓసీ, బీసీలకు 90శాతం రాయితీ పై అందిస్తుండగా.. ఎస్సీలకు వంద శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆయిల్‌పాం సాగులో అంతర్ పంటలు వేసుకునేందుకు మూడేళ్ల వరకు రూ.4,200 ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సంగారెడ్డి ఉద్యానవన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, సభ్యురాలు శోభ, ఆదర్శ రైతులు ఆనందం, దయానంద, దేవయ్య పాల్గొన్నారు.

చెరకు రైతులను ఆదుకోవాలి

సంగారెడ్డి టౌన్ : చెరుకు రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసల్వాది గ్రామంలోని గణపతి చక్కెర ఫ్యాక్టరీలో రోజుకు 3వేల క్రషింగ్ జరుగుతుండగా.. 5 వేలకు కట్టింగ్ ఆర్డర్ ఇచ్చి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. రెండు రోజులకు లోడు ఖాళీ అవుతుండటంతో పొలంలో చెరకు ఎండిపోయి రైతుకు నష్టం కలుగుతుందని చెప్పారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆ నలుగురు

అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు • ఆరేళ్లుగా ఆదర్శవంతమైన సేవలు

శవయాత్ర ఎదురైతేనే అశుభం అంటూ ఇంట్లోకి వెళ్లిపోతాం.. ఎవరిదైనా శవం రోడ్డుపై పడి ఉంటే అటువైపు కూడా చూడకుండా వెళ్లిపోతుంటాం.. కొన్నిసార్లు బంధువుల మృతదేహాలను ముట్టుకోవడానికే వెనుకాడుతుంటాం .. అలాంటిది.. అనాథ శవాలకు అన్నీ వారై అంత్యక్రియలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు మధుసూదన్ బృందం.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

''ఒక్కడై రావడం.. ఒక్కడై పోవడం.. నడుమ ఈ నాటకం.. విధి లీల.. వెంట ఏ బంధము.. రక్తం సంబంధం.. తోడుగా రాదుగా.. ఈ వేళ.. మరణమనేది ఖాయమని.. మిగిలేదీ కీర్తి కాయమని.. నీ బరువు.. నీ పరువు.. మోసేదీ.. ఆ నలుగురు.. ఆ నలుగురు..'' అన్నాడు ఓ సినీ కవి. అనాథ శవాలకు దహన సంస్కారాలు చేయడానికి మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు పటాన్‌చెరుకు చెందిన దాసరి మధుసూదన్ బృందం. వెంకటేశ్వర కాలనీలో ఉంటూ వ్యాపారం చేసుకునే మధుసూదన్ అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన కొంతమందితో కలిసి ఒక బృందంగా ఏర్పడి ఇప్పటి వరకు సుమారు 548 అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేశారు. పటాన్‌చెరుతో పాటు, సంగారెడ్డి, హైదరాబాద్‌లోని కొండాపూర్ వంటి ప్రాంతాల్లో ఎక్కడ అనాథ శవం ఉన్నా మధుసూదన్‌కే పిలుపు వస్తుంది. 2017 నుంచి సుమారు ఆరేళ్ల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు చెందిన వారు..

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ అయిన పటాన్‌చెరులో బిహార్, యూపీ, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. ఈ ప్రాంతంలో పని చేస్తేనే పూట గడిచే నిరుపేదలే ఎక్కువగా ఉంటారు. దురదృష్టవశాత్తు.. ఎవరైనా కార్మికుడు అకాల మరణం చెందితే.. మృతదేహాన్ని స్వస్థలాలకు తరలించాలంటే చాలా ఖర్చు అవుతుంది. వాహనం చార్జీలే రూ.లక్ష వరకు అవుతుంది. ఇంత మొత్తాన్ని భరించలేని నిరుపేద కార్మికుల శవాలకు పోలీసుల సహకారంతో మధుసూదన్ బృందం అంతిమ సంస్కారాలు నిర్వహిస్తుంటుంది.

వీడియో కాల్ చేసి..

అంతిమ సంస్కారాలు నిర్వహించే సమయంలో మృతుడి స్వస్థలంలో ఉన్న కుటుంబ సభ్యులకు మధుసూదన్ వీడియోకాల్ చేసి చూపిస్తుంటారు. అలాగైనా వారికి చివరి చూపు దక్కేలా చేస్తుంటారు. కులం, మతం తేడా లేకుండా ఈ పుణ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. మరణించిన వారి కుటుంసభ్యులకు డెత్ సర్టిఫికెట్ అందించే పనుల్లో సైతం ఆయన సాయం చేస్తుంటారు.

మార్చురీల్లో కుళ్లిపోకూడదనే..

సాధారణంగా గుర్తుతెలియని శవాలను పోలీసులు మార్చురీకి తరలిస్తుంటారు. అన్ని పోలీస్‌స్టేషన్లకు లుక్‌అవుట్ నోటీసులు ఇస్తుంటారు. నిబంధన ప్రకారం ఈ అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులేవీ లేకపోవడంతో ఈ పనులు చేసేందుకు వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. ఒక్కోసారి మార్చురీల్లో శవాలు కుళ్లిపోతుంటాయి. బతికుండగానే ఎన్నో కష్టాలు పడే మనిషికి అంతిమయాత్ర అయిన సరిగా జరగాలనే ఉద్దేశంతో మధుసూదన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కరోనా సమయంలోనూ..

కరోనా విజృంభిస్తున్న వేళ ఎదుటి వ్యక్తి దగ్గరకు వెళ్లాలంటేనే భయపడే రోజులవి. అలాంటి ఆపత్కాలంలో కూడా అనాథ శవాలకు మధుసూదన్ బృందం అంతిమ సంస్కారాలు నిర్వహించింది. ఆరు సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. తాజాగా పటాన్‌చెరులోనూ ఓ అనాథ శవానికి అంతిమ సంస్కారం చేశారు. ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడి మరణించిన వారికి సైతం వీరు దహన సంస్కారం నిర్వహించారు.

'సాక్షి' కథనంతో చలించి..

'పండుటాకుకు ఎంత కష్టం..' అని 2017 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి మధుసూదన్ బృందం చలించింది. పటాన్‌చెరు బస్టాండ్‌లో ఓ అనాథ వృద్ధుడు చనిపోయాడని.. అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేరని వార్త పత్రికలో ప్రచురితమైంది. ఆ అనాథ శవాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. మృతదేహం కుళ్లిపోతుందని తెలుసుకున్న మధుసూదన్.. పోలీసులను సంప్రదించి అంత్యక్రియలు తాను చేస్తానని ముందుకొచ్చారు. అలా అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేయడం మొదలు పెట్టారు.



అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న మధుసూదన్ బృందం



అమెరికాలో నుంచి వచ్చి...

రామచంద్రాపురం వద్ద ఉన్న డ్రైనేజీలో ఓ వృద్ధుడు పడి చనిపోయాడు. అతని జేబులో ఎలాంటి ఐడెంటీ ప్రూఫ్ లేకపోవడంతో పోలీసులు ఆ శవాన్ని మార్చురీకి తరలించారు. మధుసూదన్‌కు ఫోన్ చేసి విషయం తెలపడంతో ఆయన బృందం వెళ్లి వృద్ధుడి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కొద్ది రోజులకు అమెరికాలో ఉన్న అతని కుమారుడు విషయం తెలుసుకుని మధుసూదన్ వద్దకు వచ్చి కృతజ్ఞత తెలిపాడు.

కొందరు హేళన చేశారు



మనిషి జీవితంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటుంటారు. అలాంటి మనిషి అనాథ అయినప్పటికీ అంతిమ సంస్కారాలు సక్రమంగా నిర్వహించాలనేది మా సంకల్పం. ఆరేళ్లుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దీని కోసం అయ్యే ఖర్చు మాదిరి దేవేందర్‌రాజు ఫౌండేషన్ వారు అందిస్తుంటారు. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నందుకు మొదట్లో కొందరు హేళన చేశారు. శవాలను కాల్చే మధుసూదన్ అని పిలిచేవారు. అలాంటివేవీ నేను పట్టించుకోను.

– మధుసూదన్, ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలాజీ, శంషాబాద్ రాజు, కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. చల్లంగా చూడమ్మా..

- 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్న సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఏడుపాయల దుర్గమ్మకు మొక్కు చెల్లించారు. తాను గెలిస్తే 101 టెంకాయలు కొడతానని మొక్కారు. ఆ మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఆమె గెలుపొందటంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి వారికి ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజారులు అర్చన గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట ధర్మకర్తలు మనోహర్, మోహన్‌రావు, యాదగౌడ్, బాగారెడ్డి, సూర్యశ్రీనివాస్, శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

ఇదేం దారిద్రం

- అధ్వానంగా ఝరాసంగం మండల ప్రధాన రహదారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని రహదారులు ప్రయాణికులు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రోజూ వందలాది వాహనాలు నడిచే ఈ దారులపై అడుగుకో గుంత ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన వాటిపై రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఝరాసంగం మండలంలోని రహదారితో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు ఏర్పడి.. కంకర కుప్పలు, మట్టి దిబ్బలతో దర్శనమిస్తున్నాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని అవస్థలు

మండల కేంద్రమైన ఝరాసంగం ప్రధాన రహదారి గుండా జహీరాబాద్ పట్టణానికి నిత్యం ఝరాసంగం, న్యాల్‌కల్‌తో పాటు అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్‌లోని వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా ఝరాసంగంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం కేతకి సంగమేశ్వర ఆలయానికి నిత్యం భక్తులు ఝరాసంగం–జహీరాబాద్ రహదారి వెంట వస్తుంటారు. ఈ రోడ్డు సమాంతరంగా ఉండకపోవడంతోపాటు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై పూర్తిగా తారు లేచి పోయింది. రెండేళ్ల క్రితం మహాశివరాత్రి జాతర సందర్భంగా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అధికారులు మాత్రం మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి, వాహనదారులు జారిపడి గాయాలపాలయ్యారు. అలాగే మండలంలోని వనంపల్లి, కక్కర్‌వాడ, మేదపల్లితో పాటు చాలా గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఈ దారులపై వెళ్లే వాహనాలు సైతం పాడవుతున్నాయి. దీంతో సంబంధిత శాఖ అధికారుల తీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఝరాసంగం–జహీరాబాద్ రహదారిపై ఏర్పడిన గుంతలు

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రమైన ఝరాసంగం నుంచి సిద్దాపూర్ గ్రామానికి వెళ్లేందుకు రహదారి బాగలేకపోవటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మట్టి పోయటంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేస్తుంది.

– ఏసురత్నం, సిద్దాపూర్

మరమ్మతులు చేపట్టాలి



అధ్వానంగా మారిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. గుంతలమయంగా ఉన్న రోడ్లపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని బాగు చేయాలి.

– మోహన్, ఝరాసంగం



తారు లేచిపోవటంతో మట్టివేసిన సిద్దాపూర్ రహదారి



సమావేశంలో మాట్లాడుతున్న పొసుమి బసు

కేంద్ర పథకాలు ప్రతిఒక్కరికీ అందాలి

- విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి
- కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు

సంగారెడ్డి టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు అధికారులకు సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలు గ్రాస్ రూట్ లెవెల్ చేరుకోవాలన్నదే విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యాత్రపై జిల్లా కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలందరికీ అవగాహన కల్పించడంతోపాటు అర్హులను గుర్తించి వారికి అవి అందేలా చూడాలన్నారు. పథకాల ప్రచారం కోసం విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను ఈనెల 16న సాయంత్రం 4గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాకు 10 వాహనాలు కేటాయించారని, వాటిల్లో మోదీ మెసేజ్ ఆడియో, వీడియోతో ఉంటుందన్నారు. జనవరి 25 వరకు ప్రతీరోజు ఒక్కో వాహనం రెండు గ్రామపంచాయతీలకు వెళ్తుందన్నారు.

కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 10 మొబైల్ వ్యాన్లు వచ్చాయని తెలిపారు. గ్రామస్థాయిలో ఒకరోజు ముందుగా టామ్ టామ్ వేయించి ప్రజలకు సమాచారం తెలియజేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రిపోర్ట్స్ అన్ని ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌ఓ నగేష్, ఎల్డీఎం గోపాల్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీదేవి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎస్‌ఓ వనజాత, డీపీఓ సురేష్ మోహన్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఈఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, ఉద్యాన శాఖ డీడీ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక, ఫిషరీస్, డి డబ్ల్యుఓ, బీసీ, ఎస్సీ, కార్పొరేషన్ తదితర శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎంపీఓలు పాల్గొన్నారు.

వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి అర్బన్: విద్యార్థులకు సరిగా ఉడకని అన్నం పెడుతున్న బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ భాగ్యవతిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జగదీష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ ఆగడాలను అరికట్టాలని కోరారు. ఆమె సక్రమంగా విధులకు రాకుండా నెలల తరబడి సెలవులు పెడుతున్నారని, హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపించారు. నాసిరకమైన టిఫిన్ తినలేక విద్యార్థులు స్కూల్లో కళ్ళు తిరిగి పడిపోతున్నారని తెలిపారు. రాత్రి వేళ ఉడకని అన్నం.. నీళ్ల చారు పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శీను, రజనీకాంత్ పున్లిక్ ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేతకిలో పీసీ బోర్డు మెంబర్ సెక్రెటరీ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రెటరీ క్రిష్ణ ఆదిత్య శ్రీరాంషెట్టి శుక్రవారం కేతకి సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో సీఈ బీ.రఘు, జేసీఎస్ సత్యానారాయణ, జేసీఈఈ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న క్రిష్ణ ఆదిత్య శ్రీరాంషెట్టి

రుణపాశం.. విషాదం

- భార్య, ఇద్దరు పిల్లలను చంపి.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఉసురు తీసిన ఆర్థిక ఇబ్బందులు
- మృతుడు నరేశ్ కలెక్టర్ గన్‌మెన్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ శ్వేత
- రాముని పట్లలో విషాదఛాయలు



సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్: ఆర్థిక సమస్యలు, ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఓ కుటుంబానికి శాపంగా మారింది. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దగ్గర పీఎస్‌ఓ (గన్‌మెన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక తన భార్య, ఇద్దరు పిల్లలను గన్‌తో కాల్చి.. తానూ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల నరేశ్(35), చైతన్య(30) దంపతులకు కుమారుడు రేవంత్(7), కూతురు హితాశ్రీ(5) ఉన్నారు. సిద్దిపేట పట్టణంలోని సహస్ర స్కూల్‌లో చైతన్య టీచర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. అదే పాఠశాలలో కుమారుడు రేవంత్ 2వ తరగతి, కుమార్తె హితాశ్రీ ఒకటో తరగతి చదువుతున్నారు.

అప్పుల ఊబిలోకి..

రమ్మీ గేమ్, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో నరేశ్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మూడు నెలల క్రితం గ్రామంలోని ఎకరం వ్యవసాయ భూమిని విక్రయించగా వచ్చిన రూ 24.80 లక్షలతో కొంత అప్పు తీర్చాడు. అయినా అప్పుల కొండ కరగలేదు. మరికొంత భూమిని విక్రయిద్దామని ఉమ్మడి కుటుంబ సభ్యులతో చర్చించినా వారు సుముఖత చూపలేదని తెలిసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన నరేశ్.. అప్పు తీర్చే మార్గం కానరాక ఈ దారుణానికి ఒడిగట్టాడు.

ఉలిక్కి పడ్డ రామునిపట్ల

సిద్దిపేటలో నివాసం ఉంటున్న నరేశ్ కుటుంబం ఇరవై రోజుల క్రితం రామునిపట్ల గ్రామంలోని తన సొంత ఇంటికి మకాం మార్చింది. నరేశ్ ఇక్కడి నుంచే ప్రతిరోజు డ్యూటీకి వెళ్లి వస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం డ్యూటీకి వెళ్లి నరేశ్ రిపోర్ట్ చేశాడు. కలెక్టర్ సెలవులో ఉండటంతో తిరిగి ఇంటికి వచ్చే ముందు భార్య చైతన్యకు ఫోన్ చేసి స్కూల్ బస్సులో వెళ్లకండి.. తానే స్కూల్‌కు డ్రాప్ చేస్తానని చెప్పాడు. దీంతో స్కూల్ బస్సు ఎక్కాల్సిన భార్య, ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లలు స్కూల్ యూనిఫాం, కాళ్లకు సాక్సులు ధరించి, లంచ్ బాక్స్‌లు, బ్యాగ్‌లు సర్దుకుని స్కూల్‌కు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంటికి చేరుకున్న నరేశ్.. ఇంట్లోకి వెళ్లి తన దగ్గర ఉన్న 9ఎంఎం సర్వీస్ పిస్టల్‌తో మొదట భార్య చైతన్యను, తర్వాత ఇద్దరు పిల్లలను పాయింట్ బ్లాంక్‌లో కాల్చి దారుణానికి ఒడిగట్టాడు. అనంతరం అదే గన్‌తో తన కణతిపై కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతి సమీపం నుంచి కాల్పులు జరపడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పిల్లలు ఏం పాపం చేశారు..?

ఈ ఘటనతో రామునిపట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నరేశ్ కుటుంబం మొత్తం రక్తపు మడుగులో విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. అభం, శుభం తెలియని చిన్నారులు మృతిచెందడంతో ఊరంతా దుఃఖసాగరంలో మునిగితేలింది. చిన్నారుల మృతదేహాలను చూసిన ప్రతి ఒక్కరు అయ్యో పాపం.. పిల్లలు ఏం పాపం చేశారు.. దేవుడా ఎంత పని చేశావు..? అని రోదించారు. కన్న పిల్లలు అని చూడకుండా తండ్రి కర్కశంగా కాల్చి చంపడాన్ని తీవ్రంగా కలచివేసింది.

ఘటనా స్థలానికి సీపీ శ్వేత



సమాచారం అందుకున్న సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని మీడియాకు తెలిపారు. క్షణికావేశంలో ఒక కుటుంబం బలికావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో అన్ని విషయాలు వెల్లడిస్తామని సీపీ తెలిపారు.



విగత జీవులుగా చైతన్య, నరేశ్, ఇద్దరు పిల్లలు

టీచర్ల కంటతడి

సిద్దిపేట కమాన్: సిద్దిపేట పట్టణం ఆదర్శకాలనీలోని సహస్ర స్కూల్‌లో చదువుతున్న రేవంత్, హితాశ్రీలు క్లాస్‌లో ఎంతో చురుగ్గా ఉండే వారని, చదువుల్లో ఫస్ట్ వచ్చే వారని ఉపాధ్యాయులు చెప్పారు. ఎంతో అల్లరి చేస్తూ, ముద్దు ముద్దు మాటలతో సందడి చేసేవారని, కానీ నేడు ఇలాంటి పరిస్థితిలో చూస్తామని కలలో కూడా అనుకోలేదని వారు కంటతడి పెట్టుకున్నారు. చైతన్య కూడా ఎంతో కలుపుగోలుగా ఉండేదని, స్నేహభావంతో మెలిగే వారని తమతో గడిపిన జ్ఞాపకాలను తోటి టీచర్లు గుర్తు చేసుకున్నారు.

చదువుల్లో చిన్నారులు ఫస్ట్

చైతన్య మృతి కలిచివేసింది



ప్రతి రోజు స్కూల్‌కు రాగానే తోటి టీచర్లను తప్పకుండా పలకరిస్తూ లోపలికి వెళ్లేది. ఎంతో కలుపుగోలు తనం, స్నేహభావం ఎక్కువగా ఉండేది. చైతన్య మృతి చెందిన విషయాన్ని నమ్మలేకపోతున్నాం. మమ్మల్ని ఎంతో కలిచివేసింది. శుక్రవారం ఉదయం పాఠశాలకు చైతన్య రాకపోవడంతో తనకు ఉదయం 9గంటలకు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయలేదు. సుమారు 11:30గంటల సమయంలో ఈ విషయం తెలియడంతో బాధపడ్డాం.

– కవిత, తోటి టీచర్

హితాశ్రీ ఎంతో యాక్టివ్



ఘటనలో మృతిచెందిన హితాశ్రీ క్లాస్‌తో ఎంతో యాక్టివ్‌గా ఉండేది. ఎల్‌కేజీ చదువుతున్న సమయంలో ఇంటెలిజెంట్‌గా ఉండటంతో యూకేజీ కాకుండా నేరుగా ఫస్ట్ క్లాస్‌లోకి ప్రమోట్ చేయడం జరిగింది. పెద్దయ్యాక డాక్టర్ అవుతానని చెప్పేదని.. కానీ, ఇలా అర్ధంతరంగా తన జీవితం ముగుస్తుందని అనుకోలేదని చెప్పుకుంటూ సుమలత అనే టీచర్ కన్నీటి పర్యంతమైంది.

– సుమలత, టీచర్

అప్పు తీర్చకపోతే చావే మార్గం అంటూ చెప్పేవాడు



అప్పులు తీర్చకపోతే తనకు చావు తప్ప వేరే మార్గం లేదని నరేశ్ చెప్పేవాడు. ఈ నెల 10వ తేదీన అప్పులు చెల్లిస్తానని గడువు పెట్టాడు. ఏదో విధంగా ఐదు రోజులు నెట్టుకొచ్చాడు. నిన్న రాత్రి 9 గంటలకు (ఘటనకు ముందు రోజు) సైతం నరేశ్ తనను కలిశాడు. కానీ ఇంత పని చేస్తాడని అనుకోలేదు. నరేశ్‌ను కుటుంబ సభ్యులు పట్టించుకునే వారు కాదు. రూ.10 నుంచి రూ.20లక్షలు సాయం చేస్తే బతికే వాడు.

– రాజు, మృతుడి స్నేహితుడు

ఒకే చితిపై భార్యాభర్తల అంత్యక్రియలు

ఒకే గోతిలో ఇద్దరు పిల్లల ఖననం

సిద్దిపేటఅర్బన్: ఏఆర్ కానిస్టేబుల్ నరేశ్ కుటుంబం అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శుక్రవారం అర్ధరాత్రి స్వగ్రామం రామునిపట్లలో ముగిశాయి. వ్యవసాయ బావి వద్ద కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. భార్యాభర్తలు నరేశ్, చైతన్య మృతదేహాలను ఒకే చితిపై దహనం చేశారు. వీరి చితికి నరేశ్ తండ్రి నిప్పంటించారు. ఇద్దరు పిల్లల మృతదేహాలను ఒకే గోతిలో పెట్టి తాత అంత్యక్రియలు నిర్వహించారు. తనకు తలకొరివి పెట్టాల్సిన కుమారుడికి తాను తలకొరివి పెట్టాల్సి వచ్చిందని నరేశ్ తండ్రి బోరున విలపించాడు. భార్యాభర్తల చితికి పక్కనే గోతిలో పిల్లల మృతదేహాలను ఖననం చేశారు.



ఒకే చితిపై భార్యాభర్తల మృతదేహాలు



ఒకే గోతిలో ఇద్దరు పిల్లల ఖననం

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు, కమీషన్‌ల పేరుతో బురిడీ
- రూ.41.29 లక్షలు కాజేసిన మోసగాళ్లు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైబర్ మోసానికి బలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్ మండల పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ మెస్సేజ్ డిసెంబర్ 12వ తేదీన అతడి వాట్సాప్‌కు వచ్చింది. దీంతో తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపుతూ వచ్చారు. బాధితుడు మొత్తం రూ.29 లక్షలు 56 వేలు చెల్లించాడు. చివరగా నగదు ఇవ్వాలని కోరగా నిర్వాహకులు స్పందించలేదు. తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులకు, అనంతరం అమీన్ పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఐలాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 10వ తేదీన జాబ్ ఆఫర్ మెసేజ్ వచ్చింది. అతడు కూడా టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.11 లక్షల 73 వేలు ఇన్వెస్ట్ చేశాడు. నగదు ఇవ్వాలని కోరడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'కార్తీక' సిరులు

- కాసులు కురిపించిన కార్తీకమాసం
- శ్రీలక్ష్మీనృసింహ స్వామి దర్శించుకున్న 75 వేల మంది భక్తులు
- సేవలు, పూజల ద్వారా రూ 25.57 లక్షల ఆదాయం
- హుండీ ద్వారా మరో రూ.10 లక్షలు అంచనా

నాచారంగుట్ట నారసింహుడి పుణ్యక్షేత్రం. కార్తీక మాసంలో భక్తులతో కళకళలాడింది. వేలాదిమంది స్వామిని దర్శించి మొక్కులు చెల్లించారు. ముఖ్యంగా సోమవారాలు క్షేత్రం మరింత శోభాయమానంగా అలరారింది. ఆర్జిత సేవలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు, కల్యాణాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం కాసులు కూడా కురిపించింది. ఈ ఒక్క మాసంలోనే రూ.25.57 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరింది.

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారంగుట్ట పుణ్యక్షేత్రానికి ఈ కార్తీక మాసంలో అధిక ఆదాయం సమకూరింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తుల తాకిడితో హుండీలో రాబడి పెరిగింది. కార్తీక మాసం నవంబర్ 14వ తేదీన ప్రారంభమై డిసెంబర్ 12తో ముగిసింది. ఈ మాసంలో క్షేత్ర సందర్శన, వ్రతాలు, అభిషేకాలు, దీపారాధన ఎంతో శుభకరమని భక్తులు విశ్వసిస్తారు. దీంతో శివకేశవుల నెలవైన నాచగిరి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగి, నిత్యపూజలు, వ్రతాలు, కల్యాణాలు, నిజాభిషేకాలు, ఆర్జిత సేవలతో అలరారింది.

రూ 25.57 లక్షల ఆదాయం

కార్తీకమాసంలో స్వామిని 75 వేల మంది భక్తులు దర్శించారు. మొత్తం 1,755 సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం ద్వారా రూ.1,78,190, శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.8,76,500, స్వామివారి కల్యాణాల ద్వారా రూ.2,15,000, సేవల ద్వారా రూ.1,17,150, కుంకుమార్చన, దీపారాధన ద్వారా రూ.82,944, అభిషేకాల ద్వారా రూ.1,04,800, లడ్డూ ప్రసాదం విక్రయంద్వారా రూ.5,79,505, పులిహోర ద్వారా రూ.3,13,565, వడ ద్వారా రూ.34,015, తలనీలాలు, కేశఖండన ద్వారా రూ.27,730, వాహన పూజల నుంచి రూ.28,100 ఆదాయం లభించింది. మొత్తం రూ.25,57,499 ఆదాయం సమకూరింది. దానికి అదనంగా హుండీ సొమ్ము మరో రూ.10 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.



శ్రీలక్ష్మీనారసింహుడు



నాచగిరి ఆలయం

భక్తుల తాకిడి పెరిగింది..



కార్తీక మాసంలో సుమారు 75 వేల మంది భక్తులు శ్రీలక్ష్మీనృసింహ స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో క్షేత్రానికి రూ.25లక్షలపై చిలుకు ఆదాయం సమకూరింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నాం.

– అన్నపూర్ణ, ఆలయ ఈఓ

కార్తీకమాసంలో ఆలయ ఆదాయం

	వివరాలు	సంఖ్య	ఆదాయం (రూ.లలో)
1	ప్రత్యేక, శీఘ్ర దర్శనం	9,638	1,78,190
2	అభిషేకాలు	214	1,04,800
3	కుంకుమార్చన	1,133	55,840
4	గరుడ, దంపతి సేవలు	243	1,17,150
5	శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు	1755	8,76,500
6	కేశఖండన	754	27,730
7	వాహన పూజలు	222	28,100
8	ప్రసాదాలు	45817	9,27,085
9	స్వామివారి కల్యాణం	108	2,15,000
10	దీపారాధన		27,104
	మొత్తం		రూ. 25,57,499

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం

- మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు
- ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటున్న ప్రయాణికులు

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందగా మరొక ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని తాలెల్మ గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జోగిపేటకు చెందిన పిట్ల రాజ్ కుమార్(38), సంగారెడ్డి పట్టణానికి చెందిన సందీప్ కుమార్ తాలెల్మా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. శుక్రవారం ఇద్దరూ బైక్ పై పాఠశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తలెల్మా గ్రామ సమీపంలో వట్‌పల్లి నుంచి జోగిపేట వస్తున్న ఆర్టీసీ బస్సు బైకును బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాజ్‌కుమార్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందగా, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని జోగిపేట ప్రభుత్వా స్పత్రి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆస్పత్రిలో చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉపాధ్యాయుడి అకాల మరణం పట్ల ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి.



రాజ్‌కుమార్(ఫైల్)

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

జహీరాబాద్: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు చెందిన బోస్లె బబ్లిబాయి, ఆమె భర్త సూర్‌కాస్, కుమారుడు సార్తిక్‌షిండే కుటుంబం జహీరాబాద్ శివారులోని గుడిసెలో నివాసం ఉంటున్నారు. వారి తెగకు చెందిన కొంత మంది అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వీరు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేదీ రాత్రి అక్కడే నివాసం ఉంటున్న ప్రవీణ్‌రాజ్‌పుత్ కల్లు తాగి భార్య సంగీతతో గొడవ పడుతున్నాడు. సార్తిక్ షిండే వారిని విడిపించే ప్రయత్నం చేశాడు. ప్రవీణ్‌రాజ్‌పుత్ తాగిన మైకంలో సార్తిక్‌షిండేను కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన బాధితుడి తల్లి బబ్లి బాయిని కూడా గాయపర్చాడు. సార్తిక్‌షిండే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

వామ్మో.. 'చిరుత' పులి

- మూడేళ్లుగా అటవీ ప్రాంతంలో సంచారం
- సీసీ కెమెరాలో కదలికల నమోదు
- నిర్ధారించిన అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తోందని ప్రజలు భయందోళన చెందుతున్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపూర్ సమీపంలో అటవీ ప్రదేశంలో చిరుత పులి వారి కంటపడింది. మూడేళ్లుగా అది అటవీ ప్రాంతంలో సంచరిస్తోంది. 2021 ఆగస్టు 2న కల్హేర్ మండలం ఖానాపూర్(కె) శివారు అటవీ ప్రాంతంలో పశువుల కాపారులకు కనిపించింది. గ్రామ కాపరి మల్లేశం తదతరులు రోజుమాదిరిగానే గొర్రెలను మేపేందుకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ బండరాయిపై చిరుత పులి కూర్చుని ఉండటం చూసి భయంతో గొర్రెలను తీసుకుని అక్కడి నుంచి పరుగు తీశారు. ఈ విషయన్ని గ్రామస్తులకు తెలిపారు. అంతకు ముందు 2021 జులై 26న చింతల్‌గడి ప్రాంతంలో కంగ్టి మండలం ముకుందనాయక్ తండాకు చెందిన గిరిజనులు పశువులను మేపేందుకు వలస వచ్చారు. చింతల్‌గడి ప్రాంతంలో పశువులపై చిరుత పులి దాడిచేసి మూడు లేగదూడలు చంపింది. కడ్పల్, నాగధర్, అలీఖాన్‌పల్లి, రాపర్తి, సిర్గాపూర్, తదితర ప్రాంతాల్లో పశువులపై దాడి చేసింది. దీంతో అటవీ శాఖ అధికారులు కడ్పల్ శివారులో కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుత పులి సంచరిస్తున్న దృశ్యాలు కెమెరాలో నమోదయ్యాయి. చిరుత పులి సంచరిస్తుందనే విషయన్నీ అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. వాహనదారులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చింతల్‌గడి, ఖానాపూర్(కె), ఖాజాపూర్, నాగధర్, కృష్ణాపూర్, కడ్పల్, సంజీవన్‌రావుపేట గ్రామల చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో ప్రజలు బయటకు తిరిగేందుకు జంకుతున్నారు.



కల్హేర్: బండరాయిపై కూర్చున్న చిరుత పులి



సీసీ ఫుటేజీలో చిరుత పులి సంచరిస్తున్న దృశ్యం

సిగ్నల్స్ లేకుండా వాహనం పార్కింగ్

- వెనుక నుంచి ఢీకొన్న ద్విచక్రవాహనదారుడి దుర్మరణం
- అర్ధరాత్రి గౌరారం రాజీవ్ రహదారిపై ఘటన



బైండ్ల భూపతి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): అర్ధరాత్రి చీకట్లో పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై నిలిపిన భారీ వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు ఢీకొని అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం అర్ధరాత్రి తరువాత జరిగింది. గౌరారం ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం నర్సంపల్లికి చెందిన బైండ్ల భూపతి(48) మర్కూక్ మండలం పాతూరులో మైసమ్మ పండగ పూజ చేసేందుకు వెళ్లాడు. పూజ ముగించుకుని గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత గౌరారం రాజీవ్‌రహదారి మీదుగా తన బైక్‌పై నర్సంపల్లికి తిరిగొస్తున్నాడు. ఈ క్రమంలో గౌరారం శివారులో పార్కింగ్ సిగ్నల్స్, ఇండికేటర్స్ పెట్టకుండా రోడ్డుపై నిలిచిఉన్న భారీ వాహనాన్ని వెనక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా పరారయ్యాడు. మృతుడి కుమారుడు భానుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టరును ఢీకొని యువకుడి మృతి



సాయికుమార్ రెడ్డి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రాంచంద్రాపూర్ శివారు రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పట్టణానికి చెందిన ఆకారపు సాయికుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బైక్‌పై కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంచంద్రాపూర్ గ్రామానికి వెళ్లేందుకు ట్రాక్టర్ యూ టర్న్ తీసుకుంటుండగా అతడు వెనుక నుంచి ఢీకొన్నాడు. బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.